# 90 సీట్లతో అధికారంలోకి వస్తాం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్

- విపక్షాలను తుక్కు తుక్కుగా ఓడించాలి
- బీఆర్ఎస్‌తోనే తెలంగాణకు భవిష్యత్
- మైనార్టీలను ఓటు బ్యాంక్‌గా చూస్తున్న కాంగ్రెస్
- కాంగ్రెస్ పాలనలో మతఘర్షణలు
- ఎంపీగా బండి సంజయ్ ఎన్ని నిధులు తెచ్చాడు
- వీధి దీపాలు ఏర్పాటు చేశామని చెప్పకోవడం సిగ్గుచేటు
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

కార్పొరేషన్, నవంబర్ 26: ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 90 సీట్లు గెలుచుకొని మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 88 సీట్లు వచ్చాయని, ఈసారి 90 సీట్లు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. నగరంలోని ప్రతిమ మల్టీప్లెక్స్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికలు తెలంగాణకు చాలా కీలకమని పేర్కొన్నారు. పదేళ్లు తెలంగాణలో మౌలిక సదుపాయాల కల్పనకు భారీగా నిధులు వ్యయం చేశామన్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే తెలంగాణ అభివృద్ధిలో ముందుకు సాగుతున్నదన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజలు విపక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ నిర్వహిస్తున్న సభలకు ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోందన్నారు. గతంలో ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చినట్లు తెలిపారు. కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చామని చెప్పుకొంటున్నదని, కాని ఆ పార్టీ తెలంగాణ ఇచ్చేలా తాము పోరాటం చేశామని గుర్తు చేశారు. కాంగ్రెస్ తెలంగాణ ఇచ్చామని చెబుతున్నా ప్రజలు నమ్మడం లేదన్నారు. ఉద్యమ సమయంలో రేవంత్‌రెడ్డి కరీంనగర్‌కు తుపాకీ పట్టుకొని వచ్చారని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందు నుంచే కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా మౌత్ టాక్ ద్వారా మార్పు కోరుకుంటున్నారంటూ గాసిప్స్ పెద్ద ఎత్తున ప్రచారం చేశారని విమర్శించారు. ప్రజలు మాత్రం మార్పు కోరుకోవడం లేదన్నారు. సంక్షేమ పథకాలు చేపడుతున్న కేసీఆర్‌ను కాదని తమ నోట్లో ఎందుకు మట్టి పోసుకుంటామని ప్రజలే చెబుతున్నారని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తున్నదని ప్రజలే గొప్పగా చెబుతున్నారని పేర్కొన్నారు. ఉపాధి కోసం వలసపోయిన వారు ఇప్పుడు గ్రామాలకు వచ్చి పనులు చేసుకుంటున్నారని, హైదరాబాద్‌లో ప్రైవేట్ సంస్థల్లో పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. 24 గంటలు నాణ్యమైన కరెంటు సరఫరా చేయడంతో పరిశ్రమలు మూడు షిఫ్టుల్లో పని చేస్తున్నాయని, ఉత్పత్తి శక్తి పెరిగిందన్నారు. ఇవన్ని చేస్తున్న కేసీఆర్‌ను ఎందుకు వదులుకుంటామని ప్రజలు చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ చేపట్టిన గాసిప్స్‌ను ప్రజలు నమ్మడం లేదన్నారు. పట్టణాలు, గ్రామాల్లో ప్రజలు బీఆర్ఎస్‌కు మద్దతుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదన్నారు. బీజేపీ ఎప్పుడో చేతులు ఎత్తేసిందన్నారు. అనేక ప్రాంతాల్లో బీజేపీకి కనీసం డిపాజిట్ కూడా రాదన్నారు. 60 స్థానాల్లో కాంగ్రెస్ తమకు దారిదాపుల్లో కూడా లేదని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ డబ్బులు ఇచ్చి పాన్‌డబ్బాలు, టీ స్టాళ్ల వద్ద అసత్య ప్రచారం చేస్తున్నదని చెప్పారు. దీనికి గొప్పగా వారు పోల్ మేనేజ్‌మెంట్ అనే పేరు పెట్టారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో ప్రతి స్థానాన్ని బ్రహ్మాండంగా గెలవబోతున్నామని ధీమా వ్యక్తం చేశారు. లేని విషయాలను కాంగ్రెస్ ఉన్నట్లుగా క్రియేట్ చేసే ప్రయత్నాలు చేస్తున్నదని విమర్శించారు. గ్రామాల్లో ప్రజల వద్దకు వెళ్తే అసలు విషయాలు తెలుస్తాయన్నారు. బీజేపీకి రాష్ట్రంలో 119 స్థానాల్లో పోటీ చేసే శక్తి లేదని తాము ఎప్పుడో చెప్పామన్నారు. కర్ణాటక ఎన్నికలకు ముందు కొందరు కాంగ్రెస్ నాయకులు బీజేపీ ఎదుగుతుందంటూ అందులో చేరారని, అయితే కర్ణాటక ఎన్నికల తర్వాత మళ్లీ తిరుగుముఖం పట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి కూడా అదే పరిస్థితి ఉంటుందన్నారు. ఈ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ఉండదన్నారు. కాంగ్రెస్ నుంచి సీఎం అవుతామని చెప్పుకుంటున్న నాయకుడు కూడా ఓడిపోయే స్థితిలోనే ఉన్నారని పేర్కొన్నారు. 10 హెచ్‌పీ మోటర్లు పెట్టాలన్నప్పుడే రేవంత్‌రెడ్డికి వ్యవసాయం అంటే తెలియదని ప్రజలకు అర్థమైందన్నారు. మూడు గంటల కరెంటు ఉంటే సరిపోతుందని కాంగ్రెస్ చెబుతున్నదని విమర్శించారు. తెలంగాణ రాక ముందు 7778 మెగావాట్ల కరెంటు వినియోగం ఉండగా, ఇప్పుడు 26 వేలకు పెరిగిందని గుర్తు చేశారు. గోదావరి నదిపై కాంగ్రెస్, టీడీపీలు 60 ఏళ్లలో ఒక్క ప్రాజెక్టు మాత్రమే కట్టారని, పదేళ్లలోనే కేసీఆర్ 5 ప్రాజెక్టులు నిర్మించారని తెలిపారు. రాష్ట్రంలో 44 వేల చెరువుల్లో మిషన్ కాకతీయ కింద మరమ్మతులు చేయించడంతో నిండు కుండల్లా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ముందు నుంచి మైనార్టీలను ఓటు బ్యాంకుగా మార్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలోనే మతకలహాలు జరిగాయని గుర్తు చేశారు. వారి పాలనలో సీఎంను మార్చాలన్నప్పుడల్లా మత ఘర్షణలు సృష్టించే వారని విమర్శించారు. వారి కాలంలో ముస్లింలు అన్యాయానికి గురయ్యారన్నారు. రాష్ట్రంలో కర్ఫ్యూ అనే పదాన్ని మరిచిపోయే విధంగా శాంతిభద్రతలను కాపాడుతున్నట్లు తెలిపారు. వరంగల్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్‌కు ఒక్క సీటు కూడా రాదన్నారు. ఒక్క హుజూరాబాద్‌లోనే త్రిముఖ పోటీ ఉందన్నారు. కరీంనగర్‌లో గంగుల కమలాకర్ భారీ మెజార్టీతో గెలుస్తారని స్పష్టం చేశారు.

***ఎంపీగా బండి సంజయ్ సాధించిందేమిటీ?***

ఎంపీ బండి సంజయ్ ఒక్క పని అయినా చేశాడా అని ప్రశ్నించారు.? తాము కేంద్రంలో ప్రతిపక్షంలో ఉన్నా కూడా కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించామని తెలిపారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వేలైన్ మంజూరు చేయించి ప్రధాని మోదీతో శంకుస్థాపన చేయించినట్లు గుర్తు చేశారు. మధ్య మానేరుపై రైల్ కమ్ రోడ్డు బ్రిడ్జి కోసం ప్రతిపాదనలు చేశామన్నారు. మధ్య మానేరులో రెండు కిలోమీటర్ల మేరకు ఈ బ్రిడ్జి తెలంగాణ యువత గర్వపడేలా తీర్చిదిద్దేందుకు ప్రతిపాదనలు చేశామన్నారు. ఎంపీగా గెలిచిన నాయకులు ఇలాంటివి ఆలోచన చేయాలని సూచించారు. కానీ, బండి సంజయ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కరపత్రం ఇచ్చారని, తాను ఎంపీగా స్ట్రీట్ లైట్లు పెట్టించానని చెప్పుకోవడం సిగ్గు చేటన్నారు. ఎంపీ ల్యాడ్స్ నిధులు వస్తాయని వాటిని ఖర్చు చేయాల్సిందేనని అన్నారు. ఎన్నికల కోసం యువతలో మతవిద్వేషాలను రెచ్చగొట్టడం సరికాదన్నారు. మళ్లీ వచ్చేది కేసీఆర్ ప్రభుత్వమేనని తెలిపారు. గొప్ప రాష్ట్రంగా తెలంగాణను తీర్చిదిద్దుతామని తెలిపారు. రాష్ట్రంలో ఈ పదేళ్ల కాలంలో 1.64 లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. దీనికి సంబంధించిన పూర్తి సమాచారం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామన్నారు. మరోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల ఆదాయం పెంచే విధంగా పథకాలను తీసుకువస్తామని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, ట్రస్మా నాయకుడు శేఖర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, దూలం సంపత్‌గౌడ్, సత్యంరావు, సాయికృష్ణ పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలి

- డబ్బులు ఇచ్చి నాయకులను కొంటున్న బండి సంజయ్
- బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్
- నగరంలో ఎన్నికల ప్రచారం



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కార్పొరేషన్, నవంబర్ 26: కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే కారు గుర్తు ఓటు వేసి బీఆర్ఎస్‌ను గెలిపించాలని పార్టీ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఆయన నగరంలోని రాంనగర్ చౌరస్తా, తెలంగాణ చౌక్, మంచిర్యాల చౌరస్తా, గాంధీ చౌక్, నాకా చౌరస్తాల్లో కార్నర్ మీటింగ్ చేపట్టారు. ఆయా డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తరలివచారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, తెలంగాణ భవిష్యత్‌ను, కరీంనగర్ అభివృద్ధిని నిర్ణయించే ఎన్నికలు ఇవి అని పేర్కొన్నారు. గత పదేళ్లల్లో కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలను గెలిపిస్తే నగరంలో కొనసాగుతున్న అభివృద్ధి నిలిచిపోతుందన్నారు. ఎంపీ బండి సంజయ్ అక్రమంగా సంపాదించిన డబ్బులతో ఎంపీటీసీలు, సర్పంచులను కొంటున్నాడని విమర్శించారు. అసమర్థుడు బండి సంజయ్ కావాలో సమర్థుడైన గంగుల కావాలో ఆలోచన చేయాలన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది లేదన్నారు. వారికి ఓటు వేసి వృథా చేసుకోవద్దని సూచించారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణను దొంగల చేతుల్లో పెట్టవద్దన్నారు. తనను గెలిపిస్తే ఉన్నత పదవి వస్తుందని, దానితో నగరాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానని చెప్పారు. బీజేపీ, కాంగ్రెస్ నాయకులకు రాష్ట్రం నుంచి నిధులు తీసుకువచ్చే దమ్ముందా? అని ప్రశ్నించారు.? తాను కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, టీటీడీ దేవాలయం, ఇస్కాన్ టెంపుల్ తీసుకువచ్చానన్నారు. వీటిని కాంగ్రెస్, బీజేపీ వారు పూర్తి చేస్తారా? అని ప్రశ్నించారు. ఎంపీగా గెలిచిన నాలుగున్నర ఏండ్లలో నయా పైసా తీసుకువచ్చి అభివృద్ధి చేయలేని బండి సంజయ్ ఎమ్మెల్యేగా గెలిస్తే ఏం తెస్తాడని నిలదీశారు. కారు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో మేయర్ యాదగిరి సునీల్‌రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణి, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు కచ్చు రవి, బోనాల శ్రీకాంత్, దిండిగాల మహేశ్, అఖిల్, శ్రీదేవి, గందె మాధవి, రమణారావు, గుగ్గిళ్ల జయశ్రీ, గంట కల్యాణి, బండారి వేణు, నాయకులు కట్ట సత్తయ్య, బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ చౌక్‌లో ప్రచారానికి హాజరైన ప్రజలు

## మంత్రి కేటీఆర్ రోడ్‌షో సక్సెస్

- చొప్పదండి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ రోడ్డులో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు మద్దతుగా నిర్వహించిన రోడ్ షోకు మంత్రి కేటీఆర్ హాజరై మాట్లాడారు.
- మంత్రి కేటీఆర్ రోడ్ షోకు చొప్పదండి పట్టణం, మండలంలోని గ్రామాల నుంచి ప్రజలను ట్రాక్టర్లు, ఆటోలు, డీసీఎం వ్యాన్లలో తరలించారు
- చొప్పదండి నియోజకవర్గంలోని 6 మండలాల నుంచి ప్రజాప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.
- రోడ్ షోకు సుమారు 25 వేల మంది హాజరయ్యారు.
- పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల మైదానం, ఎస్సారెస్పీ కెనాల్ మైదానం వద్ద పోలీసులు వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు
- జవహర్ నవోదయ విద్యాలయం వద్ద హెలీపాడ్‌ను ఏర్పాటు చేశారు
- మంత్రి కేటీఆర్ చొప్పదండి హెలిపాడ్‌కు 2.50 నిమిషాలకు వచ్చారు.
- హెలిపాడ్ వద్ద మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఘన స్వాగతం పలికారు. అక్కడి నుంచి వాహనంలో పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన రోడ్ షోకు 2.57 గంటలకు వచ్చారు.
- 3.03 నిమిషాల నుంచి 3.30 గంటల వరకు మంత్రి మాట్లాడారు.
- మంత్రి కేటీఆర్ ప్రసంగాన్ని యువకులు కేరింతల కొడుతూ ఉత్సాహంగా విన్నారు
- 3.35 గంటలకు తిరిగి హెలికాప్టర్‌లో వెళ్లారు.

**-చొప్పదండి, నవంబర్ 26**



కేటీఆర్ రోడ్‌షోకు ట్రాక్టర్లలో వస్తున్న మంగళపల్లి నాయకులు, గ్రామస్తులు

# పార్టీ మారిన సర్పంచులకు నిరసన సెగ



బద్దిపల్లిలో పటాకులు కాల్చి సంబురాలు చేసుకుంటున్న గ్రామస్తులు

- బావుపేట సర్పంచ్ భర్తను నిలదీసిన గ్రామస్తులు
- బద్దిపల్లిలో సంబురాలు చేసుకున్న స్థానికులు
- డబ్బులకు అమ్ముడు పోయారని నిలదీత

కొత్తపల్లి, నవంబర్ 26: మండలంలో పార్టీ మారిన సర్పంచులకు గ్రామస్తుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. బావుపేట సర్పంచ్ భర్త కడారి శ్రీనివాస్ డబ్బులకు అమ్ముడుపోయి బీజేపీలో చేరారనే సమాచారంతో ఆయనను గ్రామస్తులు ఆదివారం రాత్రి నిలదీశారు. డబ్బులకు అమ్ముడుపోయి గ్రామస్తులను మోసం చేశాడని, ఇన్ని రోజులు బీఆర్ఎస్ నీడన ఉండి, పార్టీతో లబ్ధి పొందిన ఆయన ఎన్నికల సమయంలో పార్టీ మారడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు గంటకుపైగా ఆయనను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. అలాగే, బద్దిపల్లి సర్పంచ్ రాచమల్ల మధు సైతం డబ్బులు తీసుకొని బీజేపీలో చేరాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి ఇన్ని రోజులుగా పట్టిన పీడ విరగడైందని గ్రామస్తులు పటాకులు కాల్చి, సంబురాలు జరుపుకొన్నారు. డబ్బుల కోసమే ఇతర పార్టీలో చేరిన నాయకులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.